
హామీలు సరే.. అమలెప్పుడు..!

- సూపర్ సిక్స్‌పై నీలినీడలు..
- వంద రోజులవుతున్నా అమలు కాని ఒక్క హామీ..

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



నియోజకవర్గాన్ని బాగా అభివృద్ధి చేసుకుందాం.. హామీల అమలుకు నాదీ బాధ్యత.. నేను ఈ దఫా పిఠాపురం నుంచి గెలిచి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళుతున్నా.. మీరు జయకృష్ణను గెలిపించి నా వెంట పంపించండి.. ఈ ప్రాంతానికి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా అంటూ ఈ ఏడాది మే 2వ తేదీన వారాహియాత్రలో భాగంగా జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాలకొండ బహిరంగ సభలో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాము ఇచ్చిన హామీల అమలుతో ఈ ప్రాంతాన్ని బంగారు కొండగా మారుస్తామన్నారు. కురుపాం నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట వారు అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు.. కూటమి అధికారంలోకి వచ్చి రేపటికి వంద రోజులు కావొస్తుంది. ఇప్పటివరకూ ఏ ఒక్క పథకం కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో నియోజకవర్గంలో వేలాది మంది ప్రజలు, మహిళలు, నిరుద్యోగులు కూటమి ప్రభుత్వ హామీల అమలు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన స్త్రీలకు ఆడబిడ్డ నిధి రూ.15 వందలు, తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు చదువుకుంటే ఒక్కొక్కరికీ రూ.15వేలు, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు అన్నదాత పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20 వేలు, యువగళం పేరిట నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు అందిస్తామన్నారు.


– పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం

మహిళకు నెలకు రూ.1500 సాయం



- 18 ఏళ్లు నిండిన స్త్రీలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇవ్వాలి. పాలకొండ నియోజకవర్గంలో సుమారు 94,328 మంది అర్హులు ఉన్నారు. ఈ లెక్కన వీరికి అందించాల్సిన మొత్తం రూ.14,14,92,000.
- కురుపాం నియోజకవర్గంలో సుమారు 45,450 మంది లబ్ధిదారులకు గాను ప్రతి నెలా రూ.6.81 కోట్లు అందాల్సి ఉంది.

అన్నదాతా సుఖీభవ



- అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వాలి. గత ప్రభుత్వం పాలకొండ నియోజకవర్గంలో 44,420 మంది రైతులకు రైతుభరోసా పేరిట ఆర్థిక సాయం అందించింది. ఈ లెక్కన చూసుకున్నా రైతులకు చెల్లించాల్సింది రూ. 88,84,00,000.
- కురుపాం నియోజకవర్గంలో 42,500 మంది రైతులకు రూ.85 కోట్లు అందాల్సి ఉంది.

గ్యాస్ సిలిండర్లు




- దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇవ్వాలి. ప్రస్తుతం పాలకొండ నియోజకవర్గంలో వివిధ గ్యాస్ ఏజెన్సీల ద్వారా 59,083 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం కనెక్షన్లు దాదాపుగా 25,870 ఉన్నట్లు అంచనా.
- కురుపాం నియోజకవర్గంలో 74,450 బీపీఎల్ కుటుంబాలు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకానికి అర్హులు

తల్లికి వందనం



- తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు చదువుకుంటే ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలి. ప్రస్తుతం పాలకొండ నియోజవర్గంలోని 4 మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 28, 984 మంది చదువుతున్నారు. వీరందరికీ రూ.43,47,60,000 ఇవ్వాల్సి ఉంది.
- కురుపాం నియోజకవర్గంలో సుమారు 55,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ లెక్కన వారికి రూ.233.7 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మహిళలకు ఉచిత బస్సు



- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. అధికారిక జనాభా లెక్కల ప్రకారం పాలకొండ నియోజకవర్గంలో మహిళల సంఖ్య 1,23,572. వీరందరికీ ప్రయాణ సౌకర్యం కల్పించాలి.
- కురుపాం నియోజకవర్గంలో సుమారు 99,736 మంది మహిళలు ఈ పథకానికి అర్హులు.

జగన్ చెప్పారు.. చేశారు..



అమ్మఒడి




పాలకొండ నియోజకవర్గంలో
తల్లులు : 1,05,028
అందిన మొత్తం:
రూ.112,96,53,735
కురుపాం నియోజకవర్గంలో:
1,57,567
అందిన మొత్తం:రూ.236.78 కోట్లు

రైతుభరోసా



పాలకొండ నియోజకవర్గంలో
రైతులు : 44,420
అందిన సాయం :
రూ.209,05,56,450
కురుపాం నియోజకవర్గంలో:
44,567
అందిన మొత్తం:
రూ.247.22 కోట్లు

నిరుద్యోగ భృతి



- యువగళం పేరిట ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు ఇవ్వాలి. పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 10,849 మంది నిరుద్యోగ యువత ఉంది. వీరికి నెలకు రూ.3,25,47,000 అందించాల్సి ఉంది.
- కురుపాం నియోజకవర్గంలో సుమారు 18 వేల మంది నిరుద్యోగులు భృతి కోసం ఎదురు చూస్తున్నారు. వారికి ప్రతి నెలా రూ.54 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ఉచిత ప్రయాణం మాటేమిటి.. ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. అధికారం చేపట్టి దాదాపు వందరోజులు కావస్తున్నా ఇంత వరకు ఆ హామీ నెరవేర్చలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి వెంటనే ఉచిత ప్రయాణం హామీ నెరవేర్చాలి.

– బలివాడ లక్ష్మి, మహిళా సంఘ నాయకురాలు, ఘనసర కాలనీ, భామిని మండలం

తల్లికి వందనం ఏప్పుడు..?



చంద్రబాబు ఎన్నికల ముందు ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం పేరున 15 వేల రూపాయలు చొప్పున ఇస్తామన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం కింద ఇద్దరు పిల్లలకు నగదు సాయం చేస్తారన్న నమ్మకంతో ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నాను. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– అల్లక కమలావతి, బత్తిలి కొత్త కాలనీ, భామిని మండలం

రూ.60 వేలు వస్తుందని ఆశపడ్డాం



నాకు నలుగురు పిల్లలు. పెద్దోడు ఇంటర్మీడియట్ చదువుతుండగా.. రెండో పాప టెన్త్, మూడో పాప నాలుగో తరగతి, నాలుగో పాప ఒకటో తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకంను అందించడంతో పిల్లల చదువులకు ఉపయోగపడింది. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. మా ఇంట్లో నలుగురు పిల్లలు చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.60,000లు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం. ఈ డబ్బులు వస్తే పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు.

– తోయక మిండు, గిరిజన మహిళ, వామసీ గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

సాగు పెట్టుబడి ఇంకెప్పడిస్తారు?



గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలోనే పీఎం కిసాన్ నిధులతో పాటు రైతు భరోసా పథకం కింద మొదటి విడత నిధులు రైతుల ఖాతాలో జమ చేసేది. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి రాలేదు. కూటమి ప్రభుత్వం వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద సాగు సాయంగా రూ.20 వేలు ఇస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ కొత్త ప్రభుత్వం ఇంతవరకు సాగు పెట్టుబడి సాయం అందించలేదు. సాగు ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోంది.

– కొండగొర్రి అప్పారావు, గిరిజన రైతు, కుక్కిడి గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

బాబు.. ఏదీ జవాబు?

అప్పుచేసి సేద్యం చేస్తున్నాం..



నేను సన్నకారు రైతును. వ్యవసాయంతో పాటు చిన్నపాటి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ప్రస్తుత ఖరీఫ్‌లో సేద్యం చేసేందుకు పెట్టుబడి లేక అప్పు చేసి సేద్యం చేస్తున్నాను. వరుస వర్షాలతో నష్టం ఏర్పడింది. తిరిగి అప్పు చేసి పంటలు వేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పీఎం కిసాన్‌తో కలిసి రూ.7,500 పెట్టుబడి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం రైతుకు రూ.20 వేలు పెట్టుబడి అందిస్తామని చెప్పింది.

– వావిలపల్లి వైకుంటరావు, రైతు, బిజ్జి గ్రామం, పాలకొండ మండలం

మహిళలకు రూ.1500 ఇవ్వాల్సిందే..



సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ప్రతీ నెలా రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో ప్రచారం హోరెత్తించారు. ఇప్పుడేమో సూపర్ సిక్స్ అంటే భయం వేస్తోందని స్వయాన ముఖ్యమంత్రే అసెంబ్లీ సాక్షిగా చెప్పుకొచ్చారు. హామీ ఇచ్చి గెలిచాక అమలు చేయడం చేతకాక ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పుకోవడం సిగ్గు చేటు. నాతో పాటు మహిళలందరూ రూ.1500 ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు.

– రెడ్డి రాజేశ్వరి, గుమ్మలక్ష్మీపురం గ్రామం

భృతి అందిస్తే మేలు..



మధ్య తరగతి కుటంబానికి చెందిన వేలాది మంది గ్రామీణ యువత ఉన్నత చదువులు పూర్తి చేసినా సరైన ఉద్యోగం లభించక తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. నోటిఫికేషన్ వస్తే దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం లేకుంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అందించాలి.

– కర్నేన శ్రీకాంత్, గ్రాడ్యుయేట్, పాలకొండ మండలం

గ్యాస్ సిలిండర్ల ఊసే లేదు



ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. సంవత్సరానికి దాదాపు తొమ్మిది గ్యాస్ బండలు అవసరమవుతున్నాయి. ఒక్కో సిలిండర్ రూ.8 వందలు దాటుతోంది. ఏడాదికి రూ.7వేల పైచిలుకు గ్యాస్‌కు ఖర్చవుతోంది. ఏటా మూడు సిలిండర్లు అంటే రూ.2,400 ఆదా అవుతుందని మహళలు భావించారు. ఆ ఊసే లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మధ్య తరగతి కుటుంబాలు అధికం. ఇచ్చిన హామీ మేరకు సిలిండర్లు అందించాలి.

– వి.ధనలక్ష్మి, గృహిణి, పాలకొండ మండలం.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 26 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27న కళాశాలలో ధ్రువపత్రాల వెరిఫికేషన్ చేయించుకుని, 29న నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటర్ మెకానిక్, కోపా, వెల్డర్, డ్రెస్‌మేకింగ్ ట్రేడుల్లో ఖాళీలున్నట్లు వెల్లడించారు.

స్కూల్ కాంప్లెక్స్ సందర్శన

సీతంపేట: స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి డిప్యూటీ ఈఓ పి.నారాయుడు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈఓ సూర్యచంద్రమౌళి, హెచ్ఎం చంద్రరావు, గోవిందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా నిలవాలి..

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు అండగా ఉంటూ అడవిలో బంజరు, పోరంబోకు భూములను వారికి కేటాయించాలని సీపీఐ ఎంఎల్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడు తూ.. అటవీప్రాంతాల్లో మైనింగ్ చేపట్టకుండా గిరిజనులకు భూములు అందివ్వాలని కోరారు.

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు



పాలకొండ రూరల్: స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పాలకొండ రూరల్: విశ్వకర్మ జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సనారీ విశ్వేశ్వర స్వామి ప్రాంగణంలో కొలువుదీరిన విశ్వకర్మ మండపంలో సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సనారీ విశ్వేశ్వర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘం, సనారి మఠం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ నిమజ్జనం..

వీరఘట్టం: మండల కేంద్రంలోని బార్నాలవీధిలో ఏర్పాటు చేసిన విశ్వకర్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలో తిరువీధి నిర్వహించి, విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ర్యాలీలో విశ్వబ్రాహ్మణుల సంఘ జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు, ఉపాధ్యాయులు

జియ్యమ్మవలస: తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఎంఈవో–1 నాగభూషణరావు అన్నారు. పెదమేరంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పద్మ, ప్రభాకరరావుకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

జిల్లేడు ద్రావణంతో సస్యరక్షణ

గుమ్మలక్ష్మీపురం: వరిలో సూక్ష్మపోషకాల నివారణకు, రసం పీల్చే పురుగుల నివారణకు జిల్లేడు ద్రావణం సంజీవనిగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో బుధవారం జిల్లేడు ద్రావణం తయారు చేయించారు. జిల్లేడు ద్రావణం పిచికారీ చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అనతరం రైతులు సాగు చేస్తున్న రాగి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సర్పంచ్ మండంగి జగ్గారావు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..



వెలగవాడలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

పాలకొండ రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోగ కారకాలను దూరం చేద్దామని ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ కేంద్రంలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, ఫిర్యాదుదారుల సంతృప్తి స్థాయిపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈమె వెంట సిబ్బంది బుల్లిబాబు, ప్రసాదరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

గరుగుబిల్లి: మండలంలో రావివలస ఐసీడీఎస్ సెక్టార్ పరిధి కారివలస అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు చేశారు. అనంతరం వారికి పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి, సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అమ్మకాలకు సిద్ధంకండి

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



ఇసుక బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, తహసిల్దార్ శేఖరం

భామిని: మండలంలోని కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వియ్యర్ నుంచి తొలగించిన ఇసుకను ఉచిత ఇసుక పథకం కింద విక్రయించాలని, ఇందుకు సంబంధిత యాప్ వినియోగించాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ నిమ్మల శేఖరం అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కుమార్, మండల సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వర్మీ కంపోస్టు తయారీపై దృష్టిసారించాలి

గరుగుబిల్లి: సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్(ఎస్‌డబ్ల్యూపీసీ)ల ద్వారా వర్మీ కంపోస్టును తయారుచేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని దళాయివలసలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని బుధవారం ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నాటికి ఈ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం వలసబల్లేరు పంచాయతీ వలసగూడ గ్రామంలో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠం తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వలసగూడలో సారా అమ్మకాలు చేపడుతున్న ఇరువురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సేంద్రియ సేద్యంతో అధిక దిగుబడులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కూరగాయాల సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కురుపాం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి గిరిజ సూచించారు. యస్ సొసైటీ, ప్రగతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం దురుబిలి గ్రామంలో హైబ్రిడ్ కూరగాయాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన, వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి ఎస్.కే గౌష్, సర్పంచ్ పువ్వల అంజలి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని దుడ్డుఖల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జి.అనీల్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు.

ఎస్సై చొరవతో గోతులు పూడ్చివేత

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ సమీపంలో పార్వతీపురం–గరుగుబిల్లి ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను బుధవారం పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు గోతులను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు చొరవతీసుకుని ట్రాక్టర్‌తో గ్రావెల్ తెప్పించి గోతుల్లో పోసి చదును చేయించారు.